సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 9 । నవంబర్ । 2023

I



వీఆర్‌కు ఉండి ఎస్సై

ఉండి: ఉండి ఎస్సై కె.గంగాధర్‌రావును రేంజ్ వీఆర్‌కు పంపినట్టు తెలిసింది. కాళ్ల ఎస్సై వీఎస్ వీరభద్రరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.



చురుగ్గా నిర్మాణం

భీమవరం పట్టణంలో 100 పడకల ప్రభుత్వాస్పత్రి భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

IIలో ▸

ధర్మప్రచార మాసోత్సవాలు

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో ఈనెల 10 నుంచి వచ్చేనెల 9 వరకు ధర్మప్రచార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు.

IIలో



న్యూస్‌రీల్

మావుళ్లమ్మ సన్నిధిలో మంత్రి రజిని



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి రజిని

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారిని బుధవారం ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు ఆమెకు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. ఆమె ఆలయంలో అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ మంత్రికి వేద ఆశీర్వాదం అందించారు. ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



ఎన్నికలకు సంబంధించిన బ్లాక్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్): రానున్న సాధారణ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లకు సన్నద్ధం చేస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం ఆమె భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, నరసాపురం వైఎన్ కళాశాల, ఉండిలో మార్కెట్ యార్డులను ఆమె పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రపరచడం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు, శిక్షణా తరగతులు నిర్వహణకు అనువైన భవనాలతో పాటు జిల్లాలో ఎన్నికల అనంతరం ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరచడానికి స్ట్రాంగ్ రూములను, ఓట్ల లెక్కింపునకు అనువైన భవనాలను జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. భీమవరంలో రెండు కళాశాలల్లో పీజీ సెంటర్, సెమినార్ రూమ్, ఆడిటోరియం, విష్ణు కాలేజీ పబ్లిక్ స్కూల్, అన్నపూర్ణ క్యాంటీన్, సీతా పాలిటెక్నికల్ కళాశాల తదితర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రత, శానిటేషన్, పార్కింగ్ ఏర్పాట్లపై సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎన్నికలు అనుభవాలు దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. భవనాలు ఖరారు చేసిన అనంతరం నివేదికను సిద్ధం చేసి ఎన్నికల సంఘానికి నివేదిస్తామన్నారు. ఆర్డీఓ శ్రీనివాసులురాజు, తహసీల్దార్ రవికుమార్, రెవెన్యూ, సర్వే సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

పీఆర్ 126 రకం సాగు చేయొద్దు

సాక్షి, భీమవరం: జిల్లాలో రానున్న దాళ్వా సీజన్‌లో పీఆర్–126 రకం వరి వంగడం సాగు చేయవద్దని కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పలువురు ఈ రకాన్ని సాగుచేయడానికి సన్నద్ధమవుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని, అయితే ఈ రకాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయనందున రైతులు ప్రైవేటుగా అమ్ముకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దాళ్వాలో వెదజల్లు పద్ధతి మేలని ఆమె సూచించారు.

ఉమ్మడి జిల్లాలో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవలు

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిగోదావరి జిల్లాలో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవలు అందుబాటులోకి వచ్చాయని జిల్లా టెలికాం జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను తెలిపారు. స్థానిక టెలికాం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 6న తాడేపల్లిగూడెంలోని నిట్ కాలేజీలో 4జీ సేవలను ఆంధ్రప్రదేశ్ టెలికాం చీఫ్ జనరల్ మేనేజర్ చేతులమీదుగా ప్రారంభించామన్నారు. ఉమ్మడి జిల్లాలో నిట్ కాలేజీలో రెండు 4జీ టవర్లు ప్రారంభించామని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా టెలికాం జనరల్ మేనేజర్ పి.రాజు, నిట్ కాలేజ్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి, జనరల్ మేనేజర్లు ఎ.శ్రీనివాసరావు, వై.రవీంద్రనాథ్ పాల్గొన్నారన్నారు.

16న ఉప సర్పంచుల ఎన్నిక

కైకలూరు: పంచాయతీ పాలకవర్గాల్లో ఖాళీగా ఉన్న ఉప సర్పంచుల ఎన్నిక ఈనెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు పశ్చిమగోదావరి జిల్లాలో చిట్టవరం (నరసాపురం), కాశిపాడు (గణపవరం), మెట్ట ఉప్పరగూడెం (తాడేపల్లిగూడెం), ఏలూరు జిల్లాలో ఆడమిల్లి (కామవరపుకోట), తామరకొల్లు (కైకలూరు), నారాయణపురం (ఉంగుటూరు)లో ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు.

జన జాతర

సామాజిక జైత్రయాత్ర

క్షీరపురి జనఝరిని తలపించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన మేలును వివరిస్తూ చేపట్టిన వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు అపూర్వ స్పందన వచ్చింది. స్వచ్ఛందంగా కదిలిన ప్రజలు యాత్రకు బ్రహ్మరథం పట్టారు. జగన్ ప్రభుత్వం బడుగులకు చేసిన మేలును మంత్రులు, ప్రజాప్రతినిధులు వివరిస్తుంటే.. తమ బతుకుల్లో వచ్చిన మార్పును గుర్తు చేసుకుని హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. బుధవారం పాలకొల్లులో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు నీరాజనాలు పలికారు.

సాధికార సంతకం

- పాలకొల్లులో కదం తొక్కిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్రకు విశేష స్పందన
- పల్లెల నుంచి భారీగా తరలిన ప్రజలు
- బస్సు యాత్రకు అడుగడుగునా ఘన స్వాగతం
- జన సంద్రంగా మారిన క్షీరపురి



క్షీరపురి.. జనఝరి.. పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్‌లో సభావేదిక వద్ద జన సందోహం



బస్సు యాత్రకు ఘన స్వాగతం

సాక్షి ప్రతినిధి, ఏలూరు/పాలకొల్లు సెంట్రల్ : పాలకొల్లు నియోజకవర్గంలోకి వచ్చిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గంలోని ప్రతి పల్లె నుంచి తరలివచ్చిన అశేష జనవాహినితో క్షీరపురి అయిన పాలకొల్లు జనసంద్రంగా మారింది. భారీ ర్యాలీతో ప్రధాన సెంటర్‌కు బస్సు యాత్ర చేరుకుంది. దివంగత మహనీయుల చిత్రపటాలకు నివాళి అర్పించి వైఎస్సార్ సీపీ సంక్షేమ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా జరిగిన మేలును మంత్రులు, ప్రజాప్రతినిధులు వివరించారు. బుధవారం పాలకొల్లులో వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర సభ నియోజకవర్గ సమన్వయకర్త గుడాల గోపి నేతృత్వంలో ఘనంగా జరిగింది.

క్షీరారామంలో పూజలు చేసి..

పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఉదయం బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామచంద్ర గార్డెన్స్ నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర కెనాల్ రోడ్డు మీదుగా గాంధీ బొమ్మసెంటర్ వరకూ సాగింది. సుమారు 2 కిలోమీటర్ల దూరం ఉన్నా అశేష జనవాహిని తరలి రావడం, భారీ బైక్ ర్యాలీతో స్వాగతం పలికిన క్రమంలో దాదాపు 45 నిమిషాలపాటు ర్యాలీ కొనసాగింది. గాంధీ బొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ వేదిక నుంచి మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రసంగించి చంద్రబాబు పాలనకు, సీఎం జగన్ పాలనకు ఉన్న తేడాను గణాంకాలతో సహా ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. రాష్ట్ర మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పినిపే విశ్వరూప్, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎంపీ నందిగం సురేష్, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ఎంపీ, ఉభయగోదావరి జిల్లాల పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్ల ఏడు నెలల కాలంలో సీఎం జగన్ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు జరిగిన మేలును వివరిస్తూ మంత్రులు సుదీర్ఘంగా ప్రసంగించారు.

క్షీరపురి.. జనఝరి : పాలకొల్లు సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. చిరుజల్లుల్లోనే ముఖ్య నాయకులంతా ప్రసంగించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీ సభ జరగడంతో వైఎస్సార్‌సీపీ కేడర్‌లో నూతనోత్సాహం నెలకొంది. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, ఎంపీ నందిగం సురేష్ చంద్రబాబు తీరుపై, గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు టీడీపీ చేసిన మోసాలను వివరించడంతో పెద్దెత్తున స్పందన లభించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం, దెందులూరు నియోజకవర్గాల్లో ఇప్పటికే బస్సు యాత్ర విజయవంతం అయ్యింది. టీటీడీ పాలక మండలి సభ్యుడు మేకా శేషుబాబు, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్, పార్టీ నేత గుణ్ణం నాగబాబు, గంటా ప్రసాద్, యడ్ల తాతాజీ, గుడూరి ఉమాబాల, మంతెన యోగీంద్రకుమార్, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, పెండ్ర వీరన్న, గుబ్బల తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సభా వేదికపై మాట్లాడుతున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, చిత్రంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి, కార్పొరేషన్ చైర్మన్లు పెండ్ర వీరన్న, గుబ్బల తమ్మయ్య, టీడీపీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు తదితరులు

సంక్షేమానికి పెద్దపీట

పాలకొల్లు నియోజకవర్గ సమన్వయకర్త గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంలో భారీ మెజార్టీ సాధించి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేస్తామన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలతో నాడు పాలకొల్లు ప్రజలను వంచిస్తే నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కాలేజీతో సహా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు.

సభ సైడ్‌లైట్స్

- మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి స్టేజీ మీదకు వచ్చి రెండు చేతులు జోడించి సభికులకు నమస్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు.
- పాలకొల్లు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు టోపీలు, జెండాలు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.
- మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.
- విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
- తెలంగాణ గాయకులు వైఎస్సార్, సీఎం జగన్ పథకాలపై పాటలు పాడి అలరించారు.
- తప్పెట గుళ్ల కళాకారుల ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది.
- నియోజకవర్గంలోని అన్ని గ్రామాలతో పాటు పట్టణవ్యాప్తంగా ప్రజలు, పార్టీ శ్రేణులు తీన్‌మార్ డప్పులతో భారీ ర్యాలీగా సభా వేదిక వద్దకు చేరుకున్నారు.
- మంత్రుల ఉత్తేజపూరిత ప్రసంగాలతో సభికులు జయజయధ్వానాలు పలికారు.



ఉరిమే ఉత్సాహం.. పార్టీ శ్రేణుల బైక్ ర్యాలీ



మహిళల జేజేలు



నీరాజనం'.. సభా ప్రాంగణం వద్ద జనసందోహం



అభిమాన తరంగం.. ఫ్లెక్సీలతో కేరింతలు

సామాజిక న్యాయానికి వేదికగా రాష్ట్రం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు బంధువు సీఎం జగన్
- కులగణనతో 139 వెనుకబడిన కులాల స్థితిగతుల్లో మార్పు
- మంత్రి చెల్లుబోయిన, ఎంపీ సురేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, చిత్రంలో ఎంపీ సురేష్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) తదితరులు

పాలకొల్లు అర్బన్: సామాజిక న్యాయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వేదిక కానుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి చెల్లబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పాలకొల్లులో బుధవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా స్థానిక రామచంద్ర గార్డెన్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా సీఎం జగన్ గుర్తింపు తీసుకువచ్చి ఆ వర్గాలకు బంధువయ్యారన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని గుర్తించిన వ్యక్తి, అంబేడ్కర్‌కి నిజమైన వారసుడు సీఎం జగన్ అని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలను వైఎస్సార్ ప్రవేశపెట్టి పేదల బిడ్డలను ఇంజనీర్లుగా, డాక్టర్లుగా తీర్చిదిద్దారన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించారని గుర్తుచేశారు. మోసగాడు చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఈ పథకాలకు తూట్లు పొడిచారని విమర్శించారు. కరోనా చికిత్సను సైతం ఆరోగ్యశ్రీలో చేర్చి పేదల ప్రాణాలు కాపాడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు. కులగణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి 139 కులాల ఆర్థిక స్థితిగతులు మార్పునకు శ్రీకారం చుట్టారన్నారు. రూ.2.38 లక్షల కోట్లు అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. దీంట్లో రూ.1.78 కోట్లు బీసీ, ఈబీసీల సంక్షేమానికి ఖర్చు చేశారని మంత్రి చెల్లుబోయిన వివరించారు.

జగన్ పాలనలోనే సామాజిక గుర్తింపు

బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ గతంలో చంద్రబాబు 600 హామీలిచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాటను దైవంగా భావిస్తారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను సామాజికంగా గుర్తించి ఆ వర్గాలకు న్యాయం చేసి ఘనత వైఎస్సార్ కుటుంబానికే సాధ్యమన్నారు. మత్స్యకారులు, నాయీబ్రాహ్మణులు, దళితులను అవమానించి దుర్మార్గుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు, శెట్టిబలిజ, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌లు గుబ్బల తమ్మయ్య, పెండ్ర వీరన్న, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, చింతలపూడి పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, అర్బన్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వనం కల్యాణి, చిట్టూరి ఏడుకొండలు, ఉచ్చుల స్టాలిన్, కుంచిలపల్లి వినిస్టన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా స్వామిత్వ సర్వే

భీమవరం (ప్రకాశం చౌక్): స్వామిత్వ సర్వే ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టరు ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో మూడో విడత సర్వే ప్రక్రియపై 24 గ్రామాలకు సంబంధించిన సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, మండల యూపీఆర్డీలకు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్వేను స్నేహపూరిత వాతావరణంలో పటిష్టంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరికీ నోటీసులు జారీ చేసి వారి సమక్షంలోనే సర్వే చేయాలన్నారు. అనుమానాలకు, వివాదాలకు తావులేకుండా ప్రక్రియ సాగాలన్నారు. ప్రభుత్వ భూములు, గ్రామ కంఠం భూములు సర్వే చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆస్తి అనుభవిస్తున్న వారికి యాజమాన్య హక్కు పత్రాలు అందజేయాలని తెలిపారు. అలాగే ప్రైవేటు ఇల్లు స్థలాలు పక్కాగా సర్వే చేయాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, ఈవోపీఆర్‌డీలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మందుగుండు తయారీ, నిల్వలపై దృష్టి సారించండి



ద్వారకాతిరుమలలో ఎస్పీ మేరీ ప్రశాంతికి స్వాగతం పలుకుతున్న ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు

ద్వారకాతిరుమల: దీపావళి మందుగుండు సామగ్రి అక్రమ తయారీ, నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ మేరీ ప్రశాంతి సిబ్బందిని ఆదేశించారు. ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌ను బుధవారం విచ్చేసిన ఆమె స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. పాత కేసుల పురోగతి, ప్రస్తుత కేసుల విచారణపై ఎస్సై సు. దీర్‌ను ఆరా తీశారు. ఎస్సై పనితీరుపై ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. తొలుత ఎస్పీకి ఏలూరు డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, భీమడోలు సీఐ భీమేశ్వర రవికుమార్, ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ ఘన స్వాగతం పలికారు.

రేషన్ బియ్యం పట్టివేత



జంగారెడ్డిగూడెంలో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న సీఎస్‌డీటీ లక్ష్మీకుమారి

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పేరంపేట రోడ్డులోని మారుతీనగర్‌లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని సీఎస్‌డీటీ వైవీ లక్ష్మీకుమారి సిబ్బందితో దాడి చేసి పట్టివేశారు. అత్యం రూప నాగ వెంకట సత్యనారాయణ గుప్తా ఇంటి వద్ద అక్రమంగా బియ్యం నిల్వ ఉందనే సమాచారం మేరకు దాడి చేసి 432 కేజీల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు గుప్తాపై 6(ఎ), 7(1) ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడుల్లో వీఆర్‌వో ఎస్.శ్రీరాములు పాల్గొన్నారు.

చురుగ్గా 'వంద పడకల' నిర్మాణం

- తాజాగా నాబార్డు నుంచి రూ.28 కోట్ల నిధులు మంజూరు
- ఇప్పటికే రూ.15.15 కోట్లతో చేపట్టిన ఆసుపత్రి నిర్మాణ పనులు
- ఎమ్మెల్యే గ్రంధి కుటుంబ సభ్యులు విరాళమిచ్చిన భూమిలో నిర్మాణం

సాక్షి, భీమవరం : భీమవరంలో 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. విద్యా, వైద్య, వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంలో ప్రభుత్వాసుపత్రి ఉన్నప్పటికీ అన్ని రకాల వైద్య సదుపాయాలు లేకపోవడంతో ఇక్కడ 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను నగరబాట కార్యక్రమంలో భాగంగా భీమవరం వచ్చిన అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి అప్పటి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తీసుకువెళ్లారు. దీనిపై అప్పట్లో వైఎస్సార్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యేగా ఎన్నికైన పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ఆసుపత్రి అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో ఇది మరుగున పడిపోయింది.



భీమవరంలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రి

రూ.30.15 కోట్ల వ్యయంతో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం

భీమవరంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తే పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాలోని అనేక గ్రామాలకు ఎంతగానో ఉపయోగం. దీంతో 2019 ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తిరిగి 100 పడకల ఆసుపత్రి అవసరాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ముందుగా రూ.10.15 కోట్లు మంజూరు చేయగా ప్రస్తుతం ఉన్న ఆసుపత్రి భవనంలో 100 పడకలు ఏర్పాటు చేయడానికి అనుకూలంగా ఉండదని భావించారు. దీంతో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కుటుంబసభ్యులు ఆసుపత్రి నిర్మాణం కోసం రూ.16 కోట్ల విలువైన నాలుగు ఎకరాల భూమిని ఉచితంగా ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. దీంతో ముందుగా మంజూరు చేసిన రూ.10.15 కోట్ల వ్యయంతో ఆసుపత్రి భవన నిర్మాణ పనులు ప్రారంభించారు.

నాబార్డు నుంచి రూ.28 కోట్లు మంజూరు

భవన నిర్మాణానికి తాజాగా ప్రభుత్వం నాబార్డు నిధుల నుంచి రూ.28 కోట్లు మంజూరు చేసింది. 100 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని అన్ని హంగులతో పూర్తి చేయడానికి ముందుగా మంజూరు చేసిన రూ.15 కోట్ల నిధులు సరిపోవని అధికారులు చెప్పడంతో శ్రీనివాస్ నిధుల ఆవశ్యకతను మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో అదనంగా రూ.28 కోట్లు మంజూరు చేశారు.

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు



భీమవరంలో 100 పడకల ఆసుపత్రి ఆవశ్యకతను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే ఆయన స్పందించి నిధులు మంజూరు చేసినందుకు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నూతన భవనాల నిర్మాణం పూర్తయితే అన్నిరకాల వైద్య సదుపాయాలు అందుబాటులోనికి వస్తాయి. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాసుపత్రిని తల్లీబిడ్డల ఆసుపత్రిగా మార్పు చేస్తాం.

– గ్రంధి శ్రీనివాస్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, భీమవరం

'ఎస్ఆర్‌కేఆర్'లో అన్వేషి చిత్ర బృందం సందడి



అన్వేషి చిత్ర బృందంతో కళాశాల డైరెక్టర్ జగపతిరాజు, ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజు

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అన్వేషి చిత్ర బృందం బుధవారం సందడి చేసింది. హీరో, హీరోయిన్స్ విజయ్, అనన్య నాగళ్ల విద్యార్థులతో కలిసి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శక, నిర్మాతలు వీజే కన్నా, టి.గణపతిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 17న రాష్ట్రవ్యాప్తంగా అన్వేషి చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం అన్వేషి చిత్రంలో ముఖ్యమైన సన్నివేశాలు, పాటల్లోని కొన్ని భాగాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు, చిత్రంలో నటించిన జబర్దస్త్ టీం గిరి, నరేష్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే.. జగనన్న ధ్యేయం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు : పేదల ఆరోగ్య సంరక్షణే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా అలంపురంలో వైద్య శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ వైద్య సేవలే పరమావధిగా భావించి నేడు పేదలకు ఇంటింటికీ ఉచిత వైద్య సేవలు అందిస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు తప్పక ఆదరించాలన్నారు. ప్రతిపక్షాలు పేదలను పట్టించుకోకుండా అధికారమే పరమావధిగా భావించి ఉమ్మడి మ్యానిఫెస్టోల పనిలో పడ్డారన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ టీడీపీతో చేతులు కలిపి చంద్రబాబుకు సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నాడన్నారు. ఆర్డీవో చెన్నయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా మంచి వైద్యం అందుతోందన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, ఎంపీపీ దాసరి హైమావతి



అలంపురంలో ఆరోగ్య సురక్ష శిబిరంలో మందుల కిట్‌ను అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రతి పేదవాడికి ఉచిత వైద్యం అందించడం శుభపరిణామం అన్నారు. పార్టీ మండల గౌరవ అధ్యక్షులు గుండుమోగుల సాంబయ్య, తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో సీహెచ్ బాలాజీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, జీజీబీ విజయలక్ష్మి, దుర్గాభవాని, పాల్గొన్నారు.

రేపటి నుంచి ధర్మప్రచార మాసోత్సవాలు

శ్రీవారి ఆలయంలో ఉత్సవాలను ప్రారంభించనున్న మంత్రి కొట్టు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి వచ్చే నెల 9 వరకు ధర్మప్రచార మాసోత్సవాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ ధర్మాదాయ శాఖ, ధర్మప్రచార పరిషత్, శ్రీవారి దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా ఉత్సవాల ఆహ్వాన పత్రికలను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్.కరికాల్ వలవన్, శాఖ కమిషనర్ రాము సత్యన్నారాయణ తదితరులకు ఈఓ వేండ్ర త్రినాథరావు మంగళవారం అందజేశారు.

ఉత్సవాలు జరిగేదిలా..

శుక్రవారం ఉదయం 9.30 గంటలకు మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు శ్రీవారు, అమ్మవార్లకు



మంత్రి కొట్టు సత్యనారాయణకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ఈఓ త్రినాథరావు (ఫైల్)

పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. అనంతరం ఆలయ అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్ఛరణలు, కళాకారుల ప్రదర్శనలు, కోలాట భజనలు, మంగళ వాయిద్యాల నడుమ ధర్మప్రచార రథాన్ని మంత్రి ప్రారంభిస్తారు. 11.30 గంటలకు ధర్మప్రచార పరిషత్ – ధార్మిక సభను ఘనంగా ప్రారంభిస్తారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు..

ఉత్సవాల ప్రారంభం అనంతరం క్షేత్రంలో నూతనంగా రూ.5.32 కోట్లతో నిర్మించిన 1 మెగావాట్ సోలార్ ప్లాంట్‌ను మంత్రి కొట్టు ప్రారంభిస్తారు. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో రూ. 10.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అనివేటి మండపం ఫేజ్–2 శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. శివాలయం వద్ద రూ.3.35 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 5 అంతస్తుల రాజగోపురం నిర్మాణానికి, రూ.1.30 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రూఫ్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేస్తారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే తలారితో పాటు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీ ప్రశాంతి తదితరులు పాల్గొంటారని ఈఓ త్రినాథరావు తెలిపారు.

తణుకు పురపాలకసంఘం		
టెండరు నోటీసు		
ఆర్.ఓ.సి.నెం.1684/02/2023/ఇ1		తేది : 08.11.2023
తణుకు పురపాలక సంఘ పరిధిలో ఈ దిగువ తెల్పిన పనులకు ఇ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.		
		ఇ.సి.వి. (రూ.లక్షలలో)
1 రోడ్లు పనులు	1 నెం	1.88
2. డ్రయిన్ పనులు	4 నెం.లు	14.49
3. వాటర్ సప్లయి పనులు	5 నెం.లు	66.45
4. ఎలక్ట్రికల్ పనులు	2 నెం.లు	18.61
5. బిల్డింగ్ పనులు	4 నెం.లు	24.14
6 ఇతరములు	5 నెం.లు	47.16
సంబంధిత వివరములకు www.apeprocurement.gov.in వెబ్‌సైటు నందు ది.11.11.2023వ తేది నుండి చూడవచ్చును		
		కమీషనరు, తణుకు పురపాలక సంఘం

డీఈఎల్‌ఈడీ 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా గత సెప్టెంబర్ 19 నుంచి 22వ తేదీ వరకూ జరిగిన డీఈఎల్‌ఈడీ 4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పీ శ్యామ్‌సుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మార్కుల జాబితాలను బీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ పరీక్షలకు సంబంధించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఒక్కొక్క సబ్జెక్టుకు రూ.500 చొప్పున సీఎఫ్ఎంఎస్ చలానా ద్వారా చెల్లించి దరఖాస్తుతో పాటు డమ్మీ మార్కుల మెమో, చిరునామా కలిగిన కవర్‌ను నేరుగా ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం గొల్లపూడి, విజయవాడ వారికి ఈ నెల 17వ తేదీలోపు పంపాలని సూచించారు.

ఫెయిలైన అభ్యర్థులకు డిసెంబర్‌లో పరీక్షలు

డీఈఎల్‌ఈడీ రెండో సెమిస్టర్‌కు సంబంధించి 2021–23, 2020–22 బ్యాచ్‌లలో అనుత్తీర్ణులైన అభ్యర్థులకు డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారని శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈ పరీక్షలకు ఫీజులు చెల్లించడానికి ఈ నెల 24వ తేదీ వరకూ గడువు ఉందని, ఈ నెల 29వ తేదీ వరకు రూ.50 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నాలుగు నుంచి ఆరు సబ్జెక్టులకు రూ.150, మూడు సబ్జెక్టులకు రూ.140, రెండు సబ్జెక్టులకు రూ.120, ఒక సబ్జెక్టుకు రూ.100 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

క్రైస్తవులకు అండగా సీఎం జగన్

తణుకు అర్బన్ : క్రైస్తవులకు అండగా నిలిచి సమస్యలు పరిష్కరించిన నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చైర్మన్‌గా తన పదవీకాలాన్ని మరో రెండేళ్లపాటు పొడిగించిన సందర్భంగా జగనన్నకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు చెప్పారు. కులమతాలకు అతీతంగా అర్హులైన పాస్టర్లతోపాటు ఇమామ్‌లు, పురోహితులకు ప్రభుత్వం గౌరవవేతనం ఇస్తుండడాన్ని అన్ని వర్గాలు స్వాగతిస్తున్నాయన్నారు. జెరూసలేం వెళ్లే క్రైస్తవులకు బీపీఎల్‌లో ఉంటే రూ.60 వేలు, మిగిలిన వారికి రూ.30 వేలు చొప్పున అందచేస్తున్నారన్నారు. త్వరలో పాస్టర్లకు సేవా పురస్కారాలు తణుకులో రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని ఇందుకోసం క్రైస్తవులు దరఖాస్తు చేసుకోవాలని



విలేకరులతో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

సూచించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కుర్చీలో కూర్చోబెట్టేందుకు క్రైస్తవులంతా సిద్ధంగా ఉండాలని కోరారు. అనంతరం జాన్ వెస్లీని పాస్టర్ల సంఘం అధ్యక్షులు మనోజ్, హారత్‌బాబు, అగ్నిజ్వాల, మాణిక్యాలరావు, షారోన్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, క్రిస్టియన్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టిప్పర్ డ్రైవర్ మృతి



శ్రీనివాసన్ మృతదేహం

తణుకు: తణుకు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ టిప్పర్ డ్రైవర్ మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తిని తమిళనాడు రాష్ట్రం కరూర్ జిల్లా తిరుక్కంపులియూర్ మండలం చిన్నమలైపట్టి గ్రామానికి చెందిన పి.శ్రీనివాసన్ (45)గా గుర్తించారు. మంగళవారం జాతీయ రహదారిపై నిర్వహణ పనులు చేస్తున్న లారీని రావులపాలెం వైపు నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ ముందు భాగం నుజ్జునుజ్జుకాగా డ్రైవర్ శ్రీనివాసన్ తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే అతనిని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఒక యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం పంగిడిగూడెం గ్రామానికి చెందిన ఇంజే రాజ్‌కుమార్ పట్టణానికి చెందిన 9వ తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. రాజ్‌కుమార్ బాలిక వెంట పడి ప్రేమిస్తున్నానని, తనను ప్రేమించకపోతే బాలికపై, తల్లిదండ్రులపై యాసిడ్ పోసి చంపేస్తానని బెదిరించాడు. బాలికను మానసికంగా, శారీరకంగా వేధిస్తూ ఈ నెల 6వ తేదీన నలుగురు వ్యక్తులతో బాలికను బలవంతంగా ఆమె ఇంటి నుంచి కిడ్నాప్ చేసి కొవ్వూరు తీసుకువెళ్లాడు. కొవ్వూరులో బాలికపై పలు మార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న బాలిక తల్లి కొవ్వూరు వెళ్లి బాలిక, రాజ్‌కుమార్‌ను జంగారెడ్డిగూడెం తీసుకువచ్చారు. అనంతరం రాజ్‌కుమార్‌ను అతని బంధువులు వచ్చి తీసుకువెళ్లిపోయారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ట్యాంక్ క్లీనర్ మృతి

పాలకొల్లు అర్బన్: లంకలకోడేరు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. పాలకొల్లు రూరల్ పంచాయతీ డ్యామ్‌పేటకు చెందిన పూజారి సతీష్, దాసరి నాగయ్య ఇద్దరూ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లుగా పనిచేస్తున్నారు. బుధవారం వీరిద్దరూ బైక్‌పై నవుడూరు వెళుతున్నారు. లంకలకోడేరు వద్దకు వచ్చేసరికి భీమవరం వైపు ముందు వెళుతున్న చేపపిల్లల లోడు లారీని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించి బైక్ అదుపుతప్పి లారీ కింద పడ్డారు. ఈ ప్రమాదంలో దాసరి నాగయ్య (65) అక్కడికక్కడే మృతి చెందగా, పూజారి సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో పాలకొల్లు వైపు



గాయపడ్డ వ్యక్తిని పరిశీలిస్తున్న ఎస్పీ యు.రవిప్రకాష్

వస్తున్న ఎస్పీ యు.రవి ప్రకాష్ తన వాహనాన్ని ఆపి సమాచారాన్ని 108 ఫోన్ తెలియజేసి, రూరల్ సీఐ, రూరల్ ఎస్సైలకు సమాచారం అందించి అప్రమత్తం చేశారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రాజమండ్రి తరలించారు. రూరల్ ఎస్సై ఎస్.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయశాఖలో స్టిచింగ్ చార్జీల నిమిత్తం టెండర్లు ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయశాఖలోని ప్రాసెస్ సర్వర్లు, ఆఫీస్ సబార్డినేట్లు, డ్రైవర్ల యూనిఫామ్ స్టిచ్చింగ్ చార్జీల నిమిత్తం 2023–24 సంవత్సరానికి సీల్డ్ టెండర్లు కోరుతున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సీల్డ్ టెండర్ కొటేషన్లను ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు చిరునామాకు ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అందేలా పంపాల్సిందిగా ఆయన కోరారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిబంధనలివే

సాక్షి, భీమవరం : దీపావళి అంటే పిల్లాపెద్దా అందరిలోనూ ఆనందమే. పండుగకు బాణసంచా కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. అయితే బాణసంచా కాల్చే సందర్భంలో జాగ్రత్తలు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే బాణసంచా దుకాణాల ఏర్పాటులోనూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తు.చ.తప్పకుండా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. బాణసంచా దుకాణాలు ఏర్పాటుకు సుమారు 150 మంది దరఖాస్తు చేసుకున్నారు. భీమవరంలో లూథరన్ హైస్కూల్ ఆవరణలో దాదాపు 31 దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. జనావాసాలకు దూరంగా దుకాణాలు పెద్ద సంఖ్యలో ఒకే చోట ఏర్పాటు చేస్తున్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో దుకాణాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది.



భీమవరంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఈ నిబంధనలు తప్పనిసరి

- బాణసంచా విక్రయ దుకాణాల వద్ద మండే స్వభావం కలిగిన వస్తువులు ఉంచరాదు.
- ఒకో దుకాణం మధ్య కనీసం మూడు మీటర్ల దూరం తప్పనిసరి. నూనె, గ్యాస్ దీపాలు దుకాణాల్లో పెట్టకూడదు.
- దుకాణాల వద్ద బాణసంచా కాల్చరాదు. గన్ పౌడర్, నైట్రేట్, క్లోరేట్, అల్యూమినియం మిశ్రమంతో తయారు చేసిన మందుగుండును విక్రయించకూడదు.
- అగ్నిప్రమాదం సంభవిస్తే అగ్ని మాపకవాహనం రావడానికి వీలుగా ఏర్పాటు చేసుకోవాలి.
- దుకాణాల వద్ద 9 లీటర్ల సామర్థ్యం కలిగిన ఫైర్ బకెట్స్ నాలుగు, పొడి ఇసుకతో రెండు, నీటితో నింపిన మరో రెండు బకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలి.
- దుకాణాల వద్ద ఫైర్‌స్టేషన్ ఫోన్ నంబర్, ఫైర్ డిపార్ట్‌మెంట్ టోల్ ఫ్రీ నంబర్ 101, పోలీసు డిపార్ట్‌మెంట్ టోల్ ఫ్రీ నంబర్ 100 ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేయాలి.

అతిక్రమిస్తే చర్యలు



బాణసంచా దుకాణాల వద్ద నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. జిల్లాలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటుకు 150 దరఖాస్తులు అందాయి. దుకాణదారులకు బాణసంచా తయారీకి అనుమతులు లేవు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– బి శ్రీనివాసరావు, జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపకాధికారి, భీమవరం

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పరిధిలోని అంబేద్కర్ కూడలిలో లారీ ఢీకొనడంతో ఓ వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ గుత్తుల శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడ పాయకపురానికి చెందిన కందుకూరి సత్యవతి (60) తల వెంట్రుకల వ్యాపారం చేస్తుంది. అంబేద్కర్ సెంటర్‌లో బుధవారం ఆమె నడిచి వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. మృతురాలి దగ్గర ఉన్న ఫోన్ ఆధారంగా ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు మృతదేహాన్ని గుర్తించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు కేవీకేలో రైతు సదస్సు

ఉండి: ఉండి ఎన్నార్పీ అగ్రహారంలోని కృషీ విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కేవీకేలో గురువారం సేంద్రియ, ప్రకృతి, వ్యవసాయ, ఉత్పత్తిదారులు, వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి గోదావరి మండలాల సహ పరిశోధకురాలు, డాక్టర్ ఎం.భరతలక్ష్మి, మారుటేరు, ఏరువాక, సేంద్రియ, వ్యవసాయ, విజయరాయి శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. అలాగే ఆసక్తి గల రైతులు, వినియోగదారులు, ఉత్పత్తిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

'విర్డ్'లో కృత్రిమ అవయవాల పంపిణీ

ద్వారకాతిరుమల: పోలియో సెరిబ్రల్ పాల్సీ వ్యాధితో బాధపడుతున్న రోగులకు స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఉచితంగా కాలిపర్స్, కృత్రిమ అవయవాలను అందజేస్తున్నట్టు ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరుకు చెందిన గుప్తా ఫౌండేషన్ సహకారంతో కాలిపర్స్‌తో పాటు, చేతులు, కాళ్లు లేని వారికి కృత్రిమ అవయవాలను అందిస్తామన్నారు. సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు విర్డ్ ఆస్పత్రిలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 83744 45108 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ అడ్డగర్ల సత్తిబాబు అలంపురంలో పని చేస్తుండగా, ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి పడి తలకు బలమైన గాయం కావడంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ సందర్భంగా సత్తిబాబును ఏఐటీయూసీ నాయకులు బుధవారం పరామర్శించారు. యూనియన్ తరఫున రూ.1,26,400లు సాయాన్ని భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు, ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, జిల్లా యూనియన్ కార్యవర్గ సభ్యుడు కోడే బాలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



పెదతాడేపల్లి గురుకుల పాఠశాలను పరిశీలించిన ఎస్.సంజీవరావు

తాడేపల్లిగూడెం రూరల్: విలువలతో కూడుకుని ఉన్నతంగా విద్యార్థులు ఎదగాలని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త ఎస్.సంజీవరావు అన్నారు. బుధవారం మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల తరగతి గది, ఆంగ్లంలో విద్యార్థులు మాట్లాడే విధానాన్ని చూసి అభినందించారు. అలాగే, స్కూల్ రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రిన్సిపల్ బి.రాజారావు, వైస్ ప్రిన్సిపల్ ప్రతాప్, ఆరుగొలను గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, పెదవేగి ప్రిన్సిపల్ వై.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ ప్రారంభం



తాడేపల్లిగూడెం పట్టణం 2వ వార్డులో డ్రెయిన్లలో దోమల మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలో దోమల నివారణ మందు పిచికారీ యంత్రం బెల్ మిస్టర్‌ను డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ప్రారంభించిన విషయం విదితమే. బుధవారం నుంచి ఈ యంత్రం సాయంతో తాడేపల్లిగూడెం పట్టణంలోని పలు వార్డుల్లో రహదారికిరువైపులా డ్రెయిన్లలో దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమాన్ని మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ప్రారంభించారు. ఈ సందర్భంగా 1, 2, 3వ వార్డుల్లో స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎ.శామ్యూల్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్, సచివాలయ కార్యదర్శి పి.తేజ, శానిటేషన్ సెక్రటరీ యర్రం లోకేష్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



తణుకులో అయ్యప్పస్వామికి పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకు జాతీయరహదారి సమీపంలో ఉన్న శ్రీ శాస్త పంచాయతన అయ్యప్పస్వామి వారి దేవస్థానంలో బుధవారం గురు స్వాములు చలపతి, శంకర్ స్వాముల ఆధ్వర్యంలో వైభవంగా పడిపూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు సత్యనారాయణస్వామి నేతృత్వంలో భక్తులు, మాలదారులు ఉదయం నుంచి స్వామికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణలు నిర్వహించి పూజాధికాలు జరిపారు. రాత్రి స్వామివారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అలంకరణ మధ్య గురుస్వాములు పడిపూజ నిర్వహించారు. అనంతరం దాత బాలనాగు సూర్యనారాయణ మాలదారులు, భక్తులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, వాసు, రవి, బాబీ, రాజేష్, సత్యనారాయణ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

గూడెంలో ప్రగతి పరుగు

- 3,547 మందికి 12 లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు
- నాలుగేళ్లలో సుమారు రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు



కడకట్ల యానాదుల కాలనీ వద్ద నిర్మిస్తున్న సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) (ఫైల్)

తాడేపల్లిగూడెం అర్బన్ : పశ్చిమ గోదావరి జిల్లాలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో అగ్రగామి వాణిజ్య కేంద్రంగా, విద్యా సంస్థల నిలయంగా విలసిల్లుతున్న తాడేపల్లిగూడెంలో ప్రగతి పరుగులు తీస్తోంది. సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించడంలో సరికొత్త వరవడిని సృష్టిస్తోంది. ఈ ప్రగతి, సంక్షేమం కొనసాగింపునకు 'మళ్లీ జగనే రావాలి...మళ్లీ కొట్టే కావాలి' అని ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) అనే కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెంలో ప్రజాభిప్రాయం సేకరించినప్పుడు వారికి చేకూరిన ప్రయోజనాలను, పొందిన లబ్ధిని ప్రజలే బాహటంగా చెబుతున్నారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘ పరిధిలో 2019 జూన్ నుంచి 2023 జూన్ వరకు జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల ద్వారా 85,917 మంది లబ్ధి పొందారు. జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ రైతు భరోసా, పంట రుణాలపై వైఎస్సార్ సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, మత్స్యకార భరోసా, డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ కాపునేస్తం, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, అగ్రిగోల్డ్, అర్చకులు, పాస్టర్లు, ఇమాములు సాయం, తెలుపురంగు రేషన్‌కార్డులకు ప్రత్యేక సాయం, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా, జగనన్న గృహాలు ఈ పథకాలు అన్నింటి ద్వారా పైన పేర్కొన్న 85,917 మంది రూ.306.21 కోట్ల మేర ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ అయ్యాయి. జగనన్న తోడు, జగనన్న గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ, పోషణ, జగనన్న విద్యాకానుక, వైఎస్సార్ కంటి వెలుగు తదితర పథకాల ద్వారా రూ.12 కోట్లు ఆర్థిక లబ్ధి పొందారు. పట్టణ పరిధిలో సొంత ఇల్లు లేని 3,547 కుటుంబాలను గుర్తించి వారందరికీ 12 లేఅవుట్లలో జగనన్న ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ఈ పట్టాలు ఇచ్చిన 3,547 మందిలో 3,443 మందికి జగనన్న ఇల్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఇందులో 1,180 గృహాలు నిర్మాణం పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేశారు. మరో 2,241 గృహాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి.

త్వరితగతిన ప్రభుత్వ సేవలు

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న ప్రభుత్వం పదికాలాల పాటు కొనసాగాలని ప్రజలు ఆశిస్తున్నారు. నేడు పట్టణ పరిధిలో 35 వార్డుల్లో 35 సచివాలయాలు, 350 మంది సిబ్బంది, నిరంతరం సేవలు అందిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వపరంగా ఏ పని కావాలన్నా, పైసా లంచం లేకుండా సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారు.

వలంటీర్ల వ్యవస్థ కొనసాగాలి

గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు ముసుగులో దళారులు లంచాలు పేరిట దోపిడీకి గురయ్యే వాళ్లం. అర్హులకు పథకాలు అందేవి కావు. నేడు జగనన్న ప్రభుత్వ హయాంలో సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను ఇంటికి చేరవేస్తున్నారు. పట్టణంలో ప్రధాన సమస్యలైన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.65 కోట్లు మంజూరు చేయించారు. పట్టణంలో అభివృద్ధి పనులకు సంబంధించి 50 రోడ్లు రూ.12.65 కోట్లతో నిర్మాణం చేపట్టగా 21 రోడ్లు పూర్తయ్యాయి. 29 పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. పార్కులు, నీటి యాజమాన్యాలకు సంబంధించి రూ.56 లక్షలతో మూడు పనులు చేపట్టగా వాటిలో రెండు పూర్తయ్యాయి. పట్టణ సుందరీకరణకు సంబంధించి రూ. 1.45 కోట్లతో 10 పనులు చేపట్టగా ఐదు పూర్తయ్యాయి. మరొక ఐదు వివిధ దశలలో ఉన్నాయి. పైపులైన్లలో వాటర్ లీకేజీలు అరికట్టేందుకు రూ. 4.73 లక్షలతో ఏడు పనులు చేపట్టగా మూడు పూర్తయ్యాయి. నాలుగు నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ నాలుగేళ్లలో సుమారు రూ.100 కోట్లతో వివిధ పనులు చేపట్టగా కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. వీటి కొనసాగింపునకు మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుతున్నారు.

రొయ్యలకు మద్దతు ధరను అమలు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రొయ్యలకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను అమలు చేయాలని, నష్టాలకు గురవుతున్న ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు కోరారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,20,000 ఎకరాల్లో ఆక్వా చెరువులు ఉండగా 70 వేల ఎకరాల్లో మాత్రమే రొయ్య సాగు జరుగుతుందని, ఏటా 18 వేల కోట్ల రూపాయిలు వ్యాపారం సాగిస్తూ వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఆక్వా రంగం నేడు తీవ్ర నష్టాలతో రైతాంగాన్ని కుదేలు చేసిందన్నారు. ఆక్వాసాగులో ఉత్పత్తి ఖర్చులు, ఇతర ఖర్చులు విపరీతంగా పెరిగాయని రైతులకు పెనుభారంగా మారిందన్నారు. తక్షణమే ఆక్వా కల్చర్ అథారిటీ బాధ్యత వహించి రైతులను ఆదుకోవాలని కోరారు.

నేడు కంటి వైద్య శిబిరం

తణుకు అర్బన్: తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ తెలిపారు. స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో తణుకు పట్టణానికి చెందిన నిసా హాస్పటల్ వైద్యులు డాక్టర్ హుస్సేన్, డాక్టర్ రషీద్ ఉచితంగా వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. న్యాయవాదులు, గుమస్తాలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు భవన్స్ విద్యార్థి ఎంపిక



విద్యార్థి సక్షమ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రాజీవ్‌కుమార్ శర్మ తదితరులు

తాడేపల్లిగూడెం రూరల్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాట్ పోటీల్లో అండర్-17 విభాగం నుంచి తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్ విద్యార్థి ఎస్.సక్షమ్ ప్రతిభ కనబర్చాడు. దీంతో అండమాన్ నికోబార్ రాష్ట్రంలో డిసెంబరులో జరగబోయే జాతీయ స్థాయి ఫుట్‌బాట్ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపల్ రాజీవ్‌కుమార్ శర్మ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సక్షమ్‌ను విద్యాసంస్థల చైర్మన్ చెరుకువాడ శ్రీరంగనాథరాజు (రంగరాజు), వైస్‌ప్రెసిడెంట్ చెరుకువాడ నరసింహరాజు, కమిటీ సభ్యులు గోపాలకృష్ణంరాజు, గ్రంధి సాయిబాబా వరప్రసాద్, పీఎస్ఎన్.మూర్తి, శివరామరాజు, హెడ్‌మిస్ట్రెస్, వ్యాయామోపాధ్యాయులు హెచ్.భాస్కరరావు, ఎ.సత్యనారాయణరాజు, కే.శ్రీనివాసరావు, ఎన్.నాగేంద్ర, మునేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం



ఉత్తమ లైసెన్స్‌డ్ ఇంజినీర్ వెంకటకుమార్‌ను సత్కరిస్తున్న అధికారులు

తణుకు: ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవాన్ని పురస్కరించుకుని తణుకులో బుధవారం వేడుకలు నిర్వహించారు. తణుకు మున్సిపల్ పరిధిలోని నిర్వహించిన ఈ వేడుకలు స్థానిక చిట్టూరి హెరిటేజ్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ లైసెన్స్‌డ్ ఇంజినీర్ కొల్లు వెంకటకుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పట్టణ ప్రణాళిక విభాగం అధికారి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణాలు, నగరాలు అభివృద్ధిలో టౌన్‌ప్లానింగ్ విభాగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఇందుకు లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు సాంకేతికను మరింత పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ వై.హేమలత, లైసెన్స్‌డ్ పర్సన్లు బీఎస్ మూర్తి, కె.బాలాజీతోపాటు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

అత్తిలి: చిత్రలేఖనంతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను సులువుగా గుర్తించవచ్చని అత్తిలి ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీఏ విజయ్‌కుమార్ తెలిపారు. చోడవరం చిత్రకళానిలయం అనకాపల్లివారు నిర్వహించిన జాతీయ చిత్రలేఖన పోటీలలో ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులను కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితం చేయకుండా, అన్ని అంశాల్లో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. అమర్ ఆర్ట్స్ అకాడమి వారి ప్రోత్సాహంతో ఎంపీయూపీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎం మౌనిక, కె కల్యాణి, ఎస్‌కే నబీనా, ఎ షణ్ముఖ్‌లు బంగారు పతకాలతో పాటు ప్రశంసా పత్రాలు సాధించారు. చిత్రలేఖన రంగంలో ప్రోత్సహిస్తున్న అమర్ ఆర్ట్స్ అకాడమివారికి కృతజ్ఞతలు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

నేటి లేగదూడలే.. రేపటి పాడి పశువులు



గేదె దూడ విభాగంలో ప్రథమ బహుమతి అందుకున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ జేసురత్నం, తాడేపల్లిగూడెం డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ ఎల్‌కే.సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని మోదుగగుంట గ్రామంలో లేగదూడల ప్రదర్శన, దూడల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో దూడల సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన ప్రదర్శనకు 40కి పైగా దూడలు రాగా, మొదటి మూడు స్థానాల్లో నిలిచిన దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లేపల్లి సత్యనారాయణ, కొమ్ముగూడెం సొసైటీ డైరెక్టర్ కామన చంద్రరావు, ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ అనిల్‌కుమార్, పశువైద్యులు సునీల్‌కుమార్, విజయ్‌కుమార్, పశుసంవర్ధక సహాయకులు మహేష్, సువర్ణరాజు, వెంకటేష్, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రంగంలో పెట్టుబడులపై సమీక్ష



శ్రీలంక డిప్యూటీ హై కమిషన్ కార్యాలయంలో నరిశే సోమేశ్వరరావు తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మేక్ ఇన్ శ్రీలంక పాలసీలో భాగంగా చెన్నైలోని శ్రీలంక డిప్యూటీ హై కమిషన్ కార్యాలయానికి తాడేపల్లిగూడెంనకు చెందిన ఎస్ఎస్ఆర్ సీ ఫుడ్స్ ఎండీ నరిశే సోమేశ్వరరావు హాజరైయారు. ఆక్వా రంగంలో శ్రీలంకలో పెట్టుబడులు పెట్టడానికి డిప్యూటీ హై కమిషన్ డాక్టర్ డి.వెంకటేశ్వరన్ ఆహ్వానం మేరకు సోమేశ్వరరావుతో పాటుగా మినిష్టర్ ఆఫ్ కామర్స్ జీఎల్ జ్ఞానదేవ్, గ్రీన్ ఆసియా ఇంపెక్స్ గ్రూపు ఆఫ్ కంపెనీస్ ఎండీ పసుపులేటి వెంకట రామారావు, ఏపీ ఛాంబర్ ప్రెసిడెంట్ పి.భాస్కరరావు, ఆల్ ఇండియా మిర్చి అసోసియేషన్ ప్రెసిడెంట్ వెలగపూడి సాంబశివరావులతో కూడిన బృందం చెన్నై వెళ్లింది. డిప్యూటీ హై కమిషన్ కార్యాలయంలో డిసెంబర్ నెలలో శ్రీలంకలో తమ బృందం పర్యటించేందుకు, అక్కడ పెట్టుబడులు పెట్టే అవకాశాలపై చర్చించినట్లు నరిశే సోమేశ్వరరావు తెలిపారు.

భారీ అన్నసమారాధన

అత్తిలి: శ్రీదేవిశరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని అత్తిలి రామన్నపేటలోగల ఐశ్వర్యదుర్గ అమ్మవారి ఆలయం వద్ద బుధవారం రాత్రి అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి వివిధ గ్రామాల ప్రజలు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

నేటి నుంచి 'జగనే ఎందుకు కావాలి' ప్రారంభం

తణుకు టౌన్: ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ఈ నెల 9 నుంచి ప్రారంభమవుతోందని మండల వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు తెలిపారు. గురువారం తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో ఈకార్యక్రమాన్ని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా తేతలి గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి కారుమూరి ప్రారంభిస్తారని తెలిపారు. ఇక్కడే నియోజకవర్గ స్థాయి రైతుల అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అర్హులైన రజకులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే ఇంటి నిర్మాణాలు చేపట్టాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడకా రాజు కోరారు. బుధవారం తాడేపల్లిగూడెం పట్టణం పుచ్చలపల్లి సందురయ్య భవనంలో యండమూరి నాగేంద్ర అధ్యక్షతన రజక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మడకరాజు మాట్లాడుతూ డిసెంబర్ 3వ తేదీన జరిగే రజక గర్జన సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టి.శ్రీను, ఎం.నాగేశ్వరరావు, సత్యనారాయణ, రాంపండు, వాసు, దుర్గాభవాని, రజక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం



బంద్‌లో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కడపలో స్టీల్‌ప్లాంట్ తక్షణం ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం తాడేపల్లిగూడెంలో అన్ని విద్యా సంస్థలను మూసివేశారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ తదితర విద్యార్థి సంఘాల నాయకులు బంద్‌లో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలు, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను బంద్ నిర్వాహకులు మూయించి వేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ అధ్యక్షుడు ఎం.రూపాశంకర్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్దిరాజు, పట్టణ అధ్యక్షుడు అజయ్‌లు మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల ప్రాణాలను ఫణంగా పెట్టి సాధించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవడానికి అందరూ కంకణబద్ధులు కావాలని అన్నారు. రాష్ట్ర విభజనతో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రానికి కడపలో స్టీల్‌ప్లాంట్ ఇస్తానన్న హామీని కేంద్రం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. నాయకులు పి.నాగేంద్ర, రవిబాబు, సాయి కుమార్, బాలు, రాజేష్, రాజకుమార్, షరీఫ్, అఫ్రిద్ తదితరులు పాల్గొన్నారు. ఈ బంద్‌కు ఐఎఫ్‌టీయూ సంఘీభావం ప్రకటించింది.

అసమానతలు లేని అభివృద్ధి కోసమే పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు నాగేశ్వరరావు

తణుకు: అసమానతలు లేని అభివృద్ధి కోసమే తమ పోరాటమని సీపీఎం రాష్ట్ర నాయకులు ఏవీ నాగేశ్వరరావు అన్నారు. ఈనెల 15న ఛలో విజయవాడకు పిలుపునిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర బుధవారం తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుంది. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పీవీ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ నాయకులు ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామాయపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, కడప ఉక్కు, రైల్వేజోన్ వంటి విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. ఈ సమస్యలపై సీపీఎం పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నామన్నారు. అనంతరం సీనియర్ నాయకులు గార రంగారావు, కృష్ణమూర్తిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బృందం నాయకులు కె.లోకనాధం, సీపీఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, కె.ధనలక్ష్మి, అంద్ర మాల్యాద్రి, జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు, జిల్లా నాయకులు ఆకుల హరేరాం, అడ్డగర్ల అజయకుమారి, సామాజిక వేత్తలు డీవీవీఎస్ వర్మ, సంకు మనోరమ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి భద్రపరిచేందుకు స్థలం పరిశీలన

ఉండి: రాబోయే సాధారణ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే సమాయత్తమవుతున్నట్లు జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి తెలిపారు. ఎన్నికల సామగ్రి భద్రపరచేందుకు తాత్కాలిక ఏర్పాట్లలో భాగంగా ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డును బుధవారం జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి, ఎస్పీ యు రవిప్రకాష్, జేసీ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల సందర్భంగా ఉండి నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల సామగ్రి భద్రపరచడానికి, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు, సిబ్బందికి శిక్షణా తరగతుల నిర్వహణ కోసం అనువైన ప్రాంతాలను పరిశీలిస్తున్నామన్నారు. ఉండి ఏఎంసీ కార్యాలయం భవనం, ఖాళీ స్థలం, గొడౌన్‌కు సంబంధించిన మ్యాపులను పరిశీలించామన్నారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎన్నికలు జరిపేందుకు ఈవీఎంలు, వీవీ ప్యాట్స్, ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు సామగ్రి భద్రతపై వివిధ ప్రాంతాలు పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ కే శ్రీనివాసులురాజు, తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్, డీటీ ఎస్వీఎస్ నాయుడు, మండల సర్వేయర్ రత్నవల్లి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఆకివీడు: మహిళల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ చైర్మన్ పుప్పాల పండు, మెప్మా చైర్మన్ మోరా జ్యోతి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే.రసూల్ బీబీ చెప్పారు. స్థానిక మాదివాడ కల్యాణమందిరంలో ఆదర్శ, కోసూరి వారి వీధి, చైతన్య స్లమ్ సమాఖ్యల సర్వ సభ్య సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపులను పటిష్ట పరచేందుకు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేస్తున్నారని చెప్పారు. వడ్డీ లేని రుణాలతో మహిళా లబ్ధిదారులు వివిధ వ్యాపారాలు కొనసాగించి లబ్ధి పొందాలన్నారు. ఆసరా పథకం ద్వారా మహిళలకు నాలుగు విడతలుగా సొమ్ము జమచేశారని చెప్పారు. అధికంగా పొదుపు చేస్తూ సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ డ్వాక్రా రుణ మాఫీ సొమ్మును నాలుగు విడతలుగా ఆసరా పథకం ద్వారా జమ చేశారన్నారు. గతంలో 100 అబద్ధాలు ఆడి అధికారం చేపట్టిన చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ చేయకుండా చేతులెత్తేసి, ఎన్నికల ముందు పసుపు కుంకుమ పేరుతో రూ.10 వేలు అందజేయడం దారుణమన్నారు. మహిళలపై జరుగుతున్న మోసాలు, ఆన్‌లైన్ మోసాలపై ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలరులు మోటుపల్లి కుమారి, నిమ్మల నాగు, వార్డు ఇన్‌చార్జి ఎండీ అలీ, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ జక్కీ, మాబూ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉణుదుర్రులో పీవీఎల్ పర్యటన

ఉండి: ఉండి మండలం ఉణుదుర్రులో గురువారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఉదయం 9:30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.85 లక్షలతో చేపట్టే పైపులైన్, మైక్రో ఫిల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు.

టెండరు నోటీసు

శ్రీభీమేశ్వర స్వామి వారి దేవస్థానము
కావలిపురం (గ్రా), ఇరగవరం (మం), పశ్చిమగోదావరి జిల్లా.

[illegible]

వ. నెం.	పని వివరము	అంచనా విలువ	ధరావతు సొమ్ము	పనిపూర్తి చేయుకాలము	షెడ్యూల్ ఖరీదు
1.	[illegible]	365000/-	9125/-	3 నెలలు	1000/-

1. [illegible] G.O.Ms.No.178/ఇరిగేషను (P.W) ది.27.9.1997 ప్రకారము [illegible] G.O.Ms.No.23 (1/CAD(PW.CAD) [illegible] ది.5.3.99 ప్రకారము. 2) [illegible] తేది.21.11.23. 3) [illegible] తేది.22.11.23 [illegible] 5.00 [illegible] 4) [illegible] తేది.28.11.2023 [illegible] 8.00 [illegible] 5) [illegible] ది.28.11.2023 సాయంత్రము 4.00 [illegible]

ది.8-11-2023 కార్యనిర్వహణాధికారి, [illegible]



పెళ్లి సంబంధం కుదరగానే వారి వారి స్థోమత మేరకు
పెళ్లి ఎంత గ్రాండ్‌గా చేయాలనే
ఆలోచన చేస్తుంటారు పెద్దవాళ్లు.
పెళ్లిలో కాబోయే అత్తగారి డిమాండ్ మేరకు
వధువు అమ్మానాన్నలు నడుచుకుంటూ ఉంటారు.
ఇందులో భాగంగా ఇటీవల
మరో కొత్త డిమాండ్ కూడా వచ్చి చేరింది.
కాబోయే పెళ్లికూతురు వివాహ వేడుకలో
దేదీప్యమానంగా వెలిగిపోవాలి.
అందరూ 'అందమైన కోడలిని సెలెక్ట్ చేసుకున్నారు
అనే కితాబులు అందుకోవాలి. అందుకు, ఏ చికిత్స
చేయించుకున్నా సరే!' అంటున్నారు. మరి,
కాబోయే వధువులు వేడుకకు సిద్ధం కావడానికి
ఎలాంటి కేర్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో
అందం పట్ల తీసుకుంటున్న చికిత్సలు..
వికటిస్తున్న పరిమాణాలు ఏమిటి?
భేష్ అనదగిన విధానాలేమిటి?
అనే విషయాలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి.

ఆపరేషన్ బ్యూటీ

పెళ్లి సంబంధాల్లో 'కొత్త' డిమాండ్

''ఓ మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న సుష్మ పెళ్లి వచ్చే డిసెంబర్‌లో జరగనుంది. పెళ్లి ఫిక్స్ అయ్యాక అత్తగారు నవ్వుతూ – 'అమ్మాయీ, నీ వంటి రంగు బ్రైట్ చేయించుకో. ఫెయిర్ నెస్ కోసం ఇంజెక్షన్లు మార్కెట్‌లో దొరుకుతాయని విన్నాను. వాటిని ట్రై చేయి. ఏ ట్రీట్‌మెంట్ అయినా తీసుకో. కానీ, పెళ్లి టైమ్‌కి అందంగా తయారవ్వాలి' అని ఆర్డర్ వేసింది. ఆమె తన కోడలు పందిట్లో చందమామలా కనిపించాలని, కోడలు మొహం చూసి బంధుమిత్రులంతా నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటుంది. 'అత్తగారి డిమాండ్ ఇప్పుడు నాకు ఆందోళన కలిగిస్తోంది' అంటోంది సుష్మ. ఇందుకోసం బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌తో పాటు చర్మ ఛాయలో కూడా తేడా వచ్చేలా మార్పులు చేసుకోవడానికి తెగ కష్టపడుతోంది. 'పెళ్లి అంటేనే ఎంతో ఉత్సాహం. ఫొటోల్లో, వీడియోల్లో బాగా కనిపించాలని, అందరిలో ప్రత్యేకంగా వెలిగిపోవాలని నాకూ ఉంటుంది. ఇందుకు బ్యూటీ పార్లర్స్‌కి వెళ్లడం, మేకప్ చేయించుకోవడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, ఇప్పుడు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్స్ కూడా చేయించుకోవాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులే కాకుండా ఈ కొత్త తరహా ఖరీదైన ఖర్చు తలనొప్పిగా మారింది అంటున్నారు అమ్మనాన్నలు' అని బాధపడుతోంది సుష్మ.

★ ★ ★

కాబోయే అత్తగారు కోరడంతో రూప (పేరు మార్చడమైంది) తన కంటి కింది భాగం లోతుగా ఉండటం వల్ల 'అండర్ ఐ ఫిల్లర్' ఇంజక్షన్ చేయించుకుంది. దీంతో కంటి కింది భాగంలో రక్తం గడ్డకట్టి, వాపు వచ్చి, బయటకు రాలేని పరిస్థితి. త్వరలో పెళ్లి. ఆ క్లాట్ అంత తొందరగా తగ్గదు. దిక్కుతోచని పరిస్థితి.

★ ★ ★

శిల్ప అందం కోసం బొటాక్స్ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. డోస్ ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వీలు లేకుండా మారిపోయింది.

★ ★ ★

అందం పెంచుకునే విషయంలో ఒకరో ఇద్దరు కాదు అమ్మాయిలు ఎప్పుడూ తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లి అంటే చెప్పనక్కర్లేదు. ప్రీ వెడ్డింగ్ షూట్ నుంచి ప్రతి సంబరాన్నీ పదిలపరుచుకోవడానికి ఎన్నో పాట్లు పడతారు. దీంట్లో భాగంగా బ్యూటీ కాన్షియస్ అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ పెరిగింది. ఈ విషయంలో ఎలాంటి చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడం మంచిది అంటున్నారు డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వప్న ప్రియ. వాటిలో...

ఇంట్లో ప్రయోగాలు..

చాలా మంది అందానికి ఇంటి చిట్కాలు పాటిస్తుంటారు. సహజంగా లభించే వాటితో బ్యూటీప్యాక్‌లు వేసుకుంటూ ఉంటారు. వాటి ద్వారా ఎంత సమయంలో ఎంత ప్రయోజనం ఉంటుందో కూడా చూడాలి. ఎందుకంటే, కొంతమందికి స్కార్స్, పింపుల్స్, యాక్నె, డల్ స్కిన్, కలర్ ఛేంజ్, చుండ్రు... ఇలా చాలా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వాటికి చికిత్సనే సరైన మార్గం. ఆహారానికి సంబంధించినవి తప్పనిసరిగా పెళ్లికి రెండు నుంచి మూడు నెలల ముందు మార్పులు చేసుకోవాలి. సహజంగా చర్మంలో మార్పులు రావాలంటే పోషకాహారం మంచి ఎంపిక. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది.

బ్యూటీ స్పాలో చికిత్స మంచిదేనా?

స్కిన్ టైటనింగ్, రింకిల్స్, స్కిన్ హైడ్రేషన్.. వంటి ట్రీట్‌మెంట్స్ బ్యూటీ స్పాలలో చేయించుకుంటారు. దీనికి కూడా ముందు సరైన కౌన్సెలింగ్ అవసరం. ఒక్కో వ్యక్తి చర్మ తత్త్వం ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విధానంలో చర్మం రికవరీ అవడానికి కూడా సమయం పడుతుంది.

ఇంజక్షన్లు సరైనవేనా...

కృత్రిమంగా కొలాజన్, స్కిన్ బూస్టర్స్.. అని తీసుకుంటున్నారు. ఎవరో చెప్పారని కొంతమంది నర్సులను ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్లు చేయించుకుంటారు. మంచి లుక్ కోసం ట్రై చేయచ్చు. కానీ, వాటి డోసుల్లో తేడాలొస్తే మొత్తం తిరగబడుతుంది.

ఆన్‌లైన్‌లో చూసి ...

సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆన్‌లైన్‌లో బ్యూటీ ఉత్పత్తులు తెప్పించుకొని, అప్లై చేసుకోవడం చూస్తుంటాం. వాటి వల్ల ఇబ్బందుల పాలైన వారు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, అవి వారికి ఎంత వరకు నప్పుతాయో తెలియదు.

కెమికల్ పీలింగ్

కెమికల్ పీల్‌లో బయటి నుంచి చర్మంలోకి ఎలాంటి రసాయనాలు చొప్పించరు. మృతకణాలను తొలగిస్తారు, చర్మం పై పార నుండి టానింగ్, పిగ్మెంటేషన్ తగ్గి కొత్త పార కనిపిస్తుంది. అయితే, దీని ద్వారా చర్మంపై కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిపుణుల సలహా అవసరం. ఇంకొన్ని పీఆర్‌పీ చికిత్సలు చర్మ నిగారింపును తీసుకువస్తాయి. అయితే, వధువులు కాబోయే అమ్మాయిలు పెళ్లికి 3 నుండి 6 నెలల ముందు ఈ కాస్మెటిక్ విధానాలను ప్రారంభించాలి. ఎందుకంటే వారి సిట్టింగ్‌లలో కనీసం 3 వారాల గ్యాప్ ఉండాలి.

లైటర్ టోన్‌లకు డిమాండ్

పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలు తమ ప్రీ-బ్రైడల్ విధానంలో రంగు ఫెయిర్‌గా మారడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిజానికి, సూర్యకిరణాల నుండి మన చర్మాన్ని మనం రక్షించుకోనప్పుడు, చర్మంలో పాచెస్ ఏర్పడతాయి. కొన్నిసార్లు సూర్యకాంతి కుడి వైపున, మరి కొన్నిసార్లు ఎడమ వైపున ఎక్కువగా పడుతుంది. సూర్యుని అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. పిగ్మెంటేషన్‌ను ప్రేరేపిస్తాయి. దీంతో అంతటా 'చర్మపు రంగు' ఒకే విధంగా ఉండదు. అంటే ముఖం మీద చాలా చోట్ల టాన్ ఉంటుంది. ఈవెన్ టోన్‌ని కలిగి ఉండాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖంపై సన్‌స్క్రీన్‌ని అప్లై చేయడం చాలా ముఖ్యం.

కాస్మొటిక్ ఫిల్లర్స్...

నిఖిత పెదవులు చాలా సన్నగా ఉంటాయి. రంగు చాలా తక్కువ. ఒకరోజు ఆమె కాబోయే అత్తగారు ఫోన్ చేసి 'నీ ముఖంలో పెదవులు కనిపించడం లేదు. ఏదైనా చికిత్స తీసుకో' అంది. దీంతో నిఖిత నర్సులను కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లను ఆశ్రయించింది. దీనిని లిప్ ఫిల్లర్ అని కూడా అంటారు. దీర్ఘకాలిక ఫలితాల కోసం, ప్రతి 6 నుండి 8 నెలలకు ఇంజెక్షన్లు చేయాలి. కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లే కాకుండా, హైలురానిక్ యాసిడ్ ఫిల్లర్ ఇంజక్షన్లు కూడా ఈ రోజుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ డెర్మా ఫిల్లర్‌లతో పెదవులు హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పగుళ్లు రావు, పూర్తి పరిమాణంలో కనిపిస్తాయి. అలాగే, కొందరు అమ్మాయిలు అత్తింటి వారు బరువు తగ్గమన్నారు కదా అని లైపోసక్షన్ వంటి చికిత్సలు చేయించుకుంటారు. దీని వల్ల చర్మంపై చారలు ఏర్పడతాయి. అవి అంత త్వరగా పోవు. ముక్కు, పెదాలు, బ్రెస్ట్ సరిచేసుకోవడానికి కాస్మొటిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు. ఏ చికిత్స అయినా కనీసం ఆరు నెలల ముందు చేయించుకుంటే వచ్చే సైడ్‌ఎఫెక్ట్‌నూ నివారించవచ్చు.

సహజమైన మెరుపే మేలు



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

పెళ్లి 10-15 రోజులు ఉందనగా ఏ బ్యూటీ ట్రీట్‌మెంట్ చేయించుకోకూడదనే విషయం ముందు గ్రహించాలి. కనీసం ఆరు లేదా మూడు నెలల ముందు బ్యూటీ చికిత్సలు చేయించుకోవచ్చు, దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే నివారించుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ అందాన్ని ఎవరూ ఇష్టపడరు. ఎప్పుడైనా సహజమైన మెరుపును ఇచ్చే బ్యూటీ ట్రీట్‌మెంట్ మాత్రమే మంచిదని గమనించాలి. అయినా తప్పదు అనుకునేవారు స్కిన్ బూస్టర్స్, ఇతర ట్రీట్‌మెంట్ వైపుగా వెళ్లచ్చు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణ అవసరం.

టిప్

డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ఇస్తున్నారా?



దీపావళికి డ్రైఫ్రూట్స్‌ను గిఫ్ట్‌గా ఇస్తుంటారు చాలామంది. అయితే డ్రైఫ్రూట్స్‌ను కొనేటప్పుడు కచ్చితంగా ఇవి గమనించుకోవాలి. ● నట్స్ రంగు ఎలా ఉందో చూడాలి. సహజంగా ఉండాల్సిన దానికంటే మరింత ముదురు రంగులో ఉంటే అవి పాడైనట్టు. రుచిగా కూడా ఉండవు కాబట్టి కొనకపోవడమే మంచిది. ● వీలైతే ఒకటి రెండు నట్స్‌ను నీటిలో వేసి, పదినిమిషాల తరువాత కొరికి చూడాలి. నానిన తరువాత కూడా గట్టిగా ఉంటే అవి చాలా పాతవి. ఇవి ఆరోగ్యానికి అంత మంచివి కావు కాబట్టి తీసుకోకూడదు. చాలా షాపులు తినడానికి శాంపిల్స్ ఇవ్వవు. ఇలాంటప్పుడు ఆ డ్రైఫ్రూట్స్‌ను తక్కువ పరిమాణంలో కొనుక్కుని పరిశీలించాలి ● నట్స్‌ని వాసన చూడాలి. ఘాటైన వాసన వస్తే అవి చాలా పాతవి. వీటికి కొద్దిగా తేమ తగిలితే వెంటనే బూజు పట్టి త్వరగా పాడవుతాయి. ఇవి తినడం ఆరోగ్యానికి మంచిది కాదు ● నట్స్ ప్యాకెట్ మీద ఎఫ్‌ఎస్‌ఎస్ఏఐ ముద్ర, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి. ఎప్పుడు ప్యాకింగ్ అయ్యింది? ఎప్పటిలోగా తినాలో సూచించే డేట్స్‌ను సరిగా చూసుకోవాలి. ఈ డేట్స్ ముద్రించని ప్యాకెట్స్‌ను కొనకూడదు ● ప్యాకెట్ మీద ముద్రించిన సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. ప్రిజర్వేటివ్‌లు కలిపిన నట్స్‌ను కొనకపోవడమే మంచిది.

ఖుషీతో దిల్ ఖుష్



చిన్నతనంలో తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని వారికి నొప్పి తెలియకుండా ఎంతో కష్టపడి పెంచుతారు తల్లిదండ్రులు. అయితే లక్నోకు చెందిన ఖుషీ అందుకు భిన్నం. తన తండ్రిలా మరెవరూ కష్టపడకూడదని తానే ఓ సామాజిక కార్యకర్తగా మారి సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఖుషీ పాండే.

లక్నోకు చెందిన 23 ఏళ్ల ఖుషీ పాండే బాల్యం ఉన్నావ్ అనే ఊళ్లో గడిచింది. తన తండ్రి నుంచి చిన్ననాటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఖుషీ తండ్రికి బాగా చదువుకోవాలని ఉండేది. కానీ పెన్సిల్ కొనే స్థోమత కూడా లేదప్పుడు. ఈ విషయం తెలుసుకుని, నాన్నలా మరెవరూ చదువుకోసం ఇబ్బంది పడకూడదు అనుకుంది. నిరుపేదలకు సాయం చేయాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకుంది.

ఖుషీ పెద్దయ్యేసరికి నాన్న వాళ్ల లక్నోకి మకాం మార్చారు. అక్కడ ఓ షాపులో పనిచేస్తూ తరువాత కాంట్రాక్టర్‌గా మారారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టులు కూడా రావడంతో ఖుషీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఖుషీ 'లా' పూర్తయ్యాక, సోషల్ వర్క్‌లో పీజీ చేసింది. చదువు పూర్తయ్యాక వెంటనే నిరుపేదలకు చదువు చెప్పడం ప్రారంభించింది. మురికివాడల్లోని పిల్లలను ఒక చెట్టుకింద కూర్చోబెట్టి సాయంత్రం రెండుమూడు గంటలు చదువు చెప్పేది. రోజుకి యాభై మంది వరకు ఖుషీ క్లాసులకు హాజరయ్యేవారు. తన దగ్గరకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తోంది.

తాతయ్య మరణంతో...

అది 2020 ... ఒకరోజు రాత్రి ఖుషీ వాళ్ల తాతయ్య షాపు నుంచి తిరిగి వస్తున్నారు. చీకట్లో సరిగా కనిపించక ఎదురుగా వచ్చే కారు తాతయ్య సైకిల్‌ని ఢీ కొట్టడంతో ఖుషీ తాతగారు అక్కడికక్కడే చనిపోయారు. తాతయ్యను ఎంతో ఇష్టపడే ఖుషీ ఈ ఘటనను తట్టుకోలేకపోయింది. సైకిల్‌కు లైట్ ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు అనుకుని ప్రతి సైకిల్‌కు లైటు ఉండాలని భావించింది. రోజూ కూలి పనిచేసుకునేవారు తమ సైకిళ్లకు లైట్లు పెట్టుకోవడానికి తగ్గ స్థోమత ఉండేది కాదు. దాంతో వాళ్లకు ఒక్కొక్కరికి 350 రూపాయల ఖరీదు చేసే లైట్లను ఉచితంగా పంచింది. ఇలా ఇప్పటిదాకా 1500 మంది వాహనాలకు బ్యాటరీతో నడిచే లైట్లను అమర్చింది. లైట్లు అమర్చడానికి 'ఇన్‌స్టాల్ లైట్స్ ఆన్ బైస్కిల్' అని రాసిన ఉన్న ప్లకార్డు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఎంతోమందికి అవగాహన కల్పించింది. అప్పట్లో ఖుషీ చేసిన ఈ పనిని ఓ ఐఏఎస్ అధికారి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఈ విషయం తెలిసిన ఎనభైమంది యువకులు ఖుషీతో కలిసి సైకిళ్లు, ట్రక్కులకు, ఇతర వాహనాలకు లైట్లు అమర్చడంలో ఖుషీకి సాయంగా నిలిచారు.





పాఠాలతో పైసలు సంపాదించి...

ఖుషీ చేస్తోన్న సామాజిక కార్యక్రమాలకు నిధులు చాలా కావాలి. ఇందుకు తన తండ్రి, బంధువులు సమకూర్చిన మొత్తం ఏమాత్రం సరిపోలేదు. దాంతో యూట్యూబ్‌లో 'లా' తరగతులు చెప్పడంతోపాటు, ఇతర పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ నెలకు అరవై నుంచి డెబ్బై వేల వరకు సంపాదించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

మహిళలకు అండగా...

బాలికలకు శానిటరీ ప్యాడ్ ల గురించి అవగాహన కల్పించడం, విద్యుత్ సదుపాయం లేని వారికి సోలర్ ల్యాంప్స్ అందించడం, 'జీవిక సాథీ' ప్రాజెక్టు పేరుతో దివ్యాంగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్, జ్యూవెలరీ తయారీలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

దుర్గ ఇండియా



ప్రతి స్త్రీ దుర్గ వలే...

ప్రతి స్త్రీలో ఒక దుర్గ ఉంటుంది. కాని ఆ దుర్గను అదిమి పెట్టేలా కుటుంబం, సమాజం ఆమెను తీర్చి దిద్దుతాయి. దాంతో తన మీద ఏ అన్యాయం జరిగినా చెప్పలేని స్థితికి చేరుతుంది. 'నువ్వు దుర్గవి. పోరాడు' అని చెప్తారు బెంగళూరులోని 'దుర్గ ఇండియా' టీమ్ సభ్యులు. ప్రియా వరదరాజన్ అనే యాక్టివిస్ట్ ఏర్పాటు చేసిన ఈ గ్రూప్ స్త్రీలను కుటుంబ హింస నుంచి... లైంగిక వేధింపుల నుంచి కాపాడటానికి పని చేస్తోంది. వారి పోరాటానికి శక్తినిస్తోంది.

'ప్రతి ఒక్కరూ మార్పు కోసం ఎదురు చూస్తారు. మనమే మార్పు కోసం ప్రయత్నిద్దామని ఎందుకు అనుకోరు... ఎదురు చూస్తూ కూచుంటే మార్పు వస్తుందా?' అంటారు ప్రియా వరదరాజన్.

బెంగళూరులో 'దుర్గ ఇండియా' అనే సంస్థ స్థాపించి స్త్రీల సమస్యలపై పని చేస్తున్న ప్రియ ఇటీవల బెంగళూరు మాల్‌లో ఒక వ్యక్తి స్త్రీలను అసభ్యంగా తాకడం గురించి ప్రస్తావిస్తూ 'పబ్లిక్ ప్లేసుల్లో– బహిరంగ ప్రదేశాల్లో గాని ఆన్‌లైన్‌లోగాని స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్య తీసుకునేందుకు ఆ బాధిత మహిళకు అండగా నిలవడం మేము చేసే పని. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు, మహిళా పోలీసులు ఎందరు ఉన్నా మహిళలకు సాటి మహిళ అండగా ఉంటే కలిగే ధైర్యం వేరు. తోటి మహిళలతో వారు చెప్పుకునేవి వేరు. అలాంటి వారికి యోగ్యులైన కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ చేయించి దిలాసా ఇప్పిస్తాము. అంతే కాదు బాధితులను వెంటబెట్టుకొని– ఆ స్టేషన్‌కుపో ఈ స్టేషన్‌కు పో అనే బాధ లేకుండా బెంగళూరులో వన్ స్టాప్ సెంటర్స్‌లో ఫిర్యాదు చేయిస్తాము. తోడుగా మేమొస్తే బాధితులు ఫిర్యాదు చేయడానికి జంకరు. ఎటొచ్చీ వారికి తోడు నిలిచే స్త్రీల బృందాలు అన్నిచోట్లా ఉండాలి' అంటుంది ప్రియ.

ఐ యామ్ ఎవ్రి ఉమన్

పదేళ్ల క్రితం ప్రియా వరదరాజన్ 'ఐ యామ్ ఎవ్రి ఉమన్' పేరుతో ఒక బ్లాగ్ రాయడం మార్పు కోసం ఆమె వేసిన మొదటి అడుగు. ఆ బ్లాగ్‌కు క్రమంగా చాలామంది మహిళా ఫాలోయర్లు వచ్చారు. వారు తమ అనుభవాలను ప్రియతో పంచుకోసాగారు. 'అందరిదీ ఒకే కథ. అందరూ మరొక స్త్రీ లాంటి వారే అని నాకు అర్థమైంది. స్త్రీల కోసం పని చేయాల్సిన అవసరం తెలియజేసింది. స్త్రీల కోసం పని చేయడం అంటే వారి పట్ల భావజాలాన్ని మార్చడమే' అంటుంది ప్రియ.

మగాడు ఎందుకు అలా చేస్తాడు?

'గతంలో సమాజంలో స్త్రీలకు ఏదైనా సమస్య వచ్చి ఆమె బయటకు చెప్పినప్పుడు– ఆమెలో ఏ దోషం ఉందో అన్నట్టుగా నిందను ఆమె మీదే వేసేవారు ఉండేవారు. వారి భావజాలాన్ని మార్చడమే చేయవలసింది. స్త్రీకి ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఆ మగాడు ఆమెతో అలా ఎందుకు చేశాడు అని ఆలోచించేలా చేస్తే సగం మార్పు వచ్చినట్టే. ఇంట్లో, వీధిలో, ఆఫీసులో స్త్రీలు ఆత్మాభిమానంతో ఉండాలంటే మగాళ్లు మారాలి. అందుకు ఒక రోజు సరిపోదు. ఒకరు పని చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరం ఏదో ఒక మేరకు పని చేయాల్సిందే' అంటుంది ప్రియ.



అందరినీ 'దుర్గ'లుగా మారుస్తూ

అన్యాయం జరిగితే వెరవకుండా ప్రతిఘటించమని ప్రియ ఆధ్వర్యంలో 'దుర్గల' బృందం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్కూళ్లలో, కాలేజీలలో, బస్తీలలో తిరుగుతూ స్త్రీలకు తమ హక్కులను, చట్టపరమైన రక్షణను, సహాయం చేసే బృందాలను తెలుపుతుంది. 'నేను ఒంటరిదాన్ని కాను అని స్త్రీ అనుకుంటే చాలు... ఆమె పోరాడగలదు' అంటుంది ప్రియ.

ఇంత ప్రయత్నం చేసే ప్రియ లాంటి వారి సంఖ్య ఎంత పెరిగితే దుర్గలకు అంత శక్తి పెరుగుతుంది.

ఫస్ట్ టైమ్

మంత్రముగ్ధులను చేసే దాస్తాంగోయి

'దాస్తాంగో ప్రదర్శన ఇస్తున్నది ఓ అమ్మాయా!!' అని బోలెడు ఆశ్చర్యపడుతూనే ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు ఒక ప్రేక్షకుడు. ఇలా కూర్చొని అలా వెళ్లిపోదాం... అనుకున్నాడు. అయితే ప్రదర్శన పూర్తయ్యే వరకు కదలకుండా కూర్చున్నాడు.

ఆ హాల్‌లో నవ్వుల్లో నవ్వు అయ్యాడు. ఏడుపులో ఏడుపు అయ్యాడు. సకల భావోద్వేగాల సమ్మేళనంతో 'దాస్తాంగోయి' ఫౌజియాను ఆశీర్వదించాడు. ఉర్దూలో మౌఖిక కథాసాహిత్య కళారూపం... దాస్తాంగో.

పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ కళారూపంలో అపారమైన పేరు తెచ్చుకొని 'ఫస్ట్ ఫిమేల్ దస్తాంగోయి'గా గుర్తింపు పొందింది ఫౌజియా...



ఫౌజియా

ఢిల్లీకి చెందిన ఫౌజియాకు స్కూల్ రోజుల నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. స్కూల్లో ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనేది. ఫౌజియా తండ్రి మోటర్‌బైక్ మెకానిక్. ఆర్థిక పరిస్థితి రీత్యా ఫౌజియా ఎప్పుడో చదువు మానేయాలి. ట్యూషన్‌లు చెప్పగా వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసింది.

దయాల్ సింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరోజు తొలిసారిగా 'దాస్తాంగో' ప్రదర్శన చూసింది ఫౌజియా. ఇక అప్పటి నుంచి 'దాస్తాంగో'పై ఆసక్తి, అభిమానం పెరిగాయి. తాను కూడా 'దాస్తాంగోయి'గా పేరు తెచ్చుకోవాలనుకుంది. 'ఇది పురుషులకు మాత్రమే పరిమితమైన కళారూపం. మహిళలు చేయలేరు. ఒకవేళ చేసినా ప్రేక్షకులు ఆదరించరు' అన్నట్లుగా చాలామంది మాట్లాడారు.

ఆ మాటలు విని ఫౌజియా కొంచెం కూడా నిరాశపడలేదు. తనపై తనకు గట్టి నమ్మకం ఉంది.

'జీవితాంతం దాస్తాంగో చెంతనే ఉండాలనుకున్నాను. ఎంతో చరిత్ర ఉన్న ఈ కళ గురించి ఈ తరంలో కొద్ది మందికి మాత్రమే తెలుసు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ తరానికి కూడా తెలిసేలా దాస్తాంగోకు ప్రాచుర్యం తీసుకురావాలనుకున్నాను' అంటుంది ఫౌజియా.

డానీష్ హుస్సేన్, మహ్మద్ ఫారూఖీ లాంటి గొప్ప కళాకారుల నుంచి 'దాస్తాంగో'ను నేర్చుకుంది ఫౌజియా. ఫౌజియా కథాసంవిధానంలో కృత్రిమమైన భాషా గాంభీర్యం వినిపించదు. పాత ఢిల్లీ యాస మాత్రమే వినిపిస్తుంది.

'మన దేశంలో ఎన్నో భాషలకు సంబంధించి ఎన్నో మాండలికాలు ఉన్నాయి. ప్రతి మాండలికానికి తనదైన సొగసు ఉంటుంది. ఈతరంలో చాలామంది తమ యాసను దాచి పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది సరి కాదు. మన ఊరు, తల్లిదండ్రులు, సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకున్నట్లే మన మాండలికం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి' అంటుంది ఫౌజియా.

ఫౌజియాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ముఖ్యంగా ఉర్దూ సాహిత్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు...'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు... 'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.



జానపద కథలు మాత్రమే కాకుండా సామాజిక సందేశం ఉన్న ఆధునిక కథలను కూడా చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఫౌజియా. దేశవిభజన సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు, హింస గురించి కథగా చెబుతున్నప్పుడు ప్రేక్షకులు కదిలిపోయారు. కోవిడ్ కల్లోల సమయంలో ఫౌజియాకు 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వడానికి కుదరలేదు. దీంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే ప్రదర్శన ఇచ్చింది.

మహాభారతం కథల నుంచి స్వాతంత్ర్యం కోసం మహాత్ముడి పోరాటం వరకు 'దాస్తాంగోయి'గా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఫౌజియాకు ఉర్దూ భాషలోనే కాదు హిందీ, ఇతర భాషలలోనూ 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వాలనేది కల. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.